క్లుప్తంగా

ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసిన శైవ పుణ్యక్షేత్రం ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లకు రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణలో మహామంగళ హారతి నిర్వహించారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ


విజయకుమార్ రెడ్డి (ఫైల్)

సంజామల: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఈ.వి జయకుమార్ రెడ్డి సోమవారం ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా ఉన్న నాగకుమార్ గత నెల 30వ తేదీ పదవీ విరమణ పొందిన సంగతి తెలిసిందే. దీంతో విజయకుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కొలిమిగుండ్ల వాసికి అవార్డు


కొలకలూరి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శేఖర్‌బాబు

కొలిమిగుండ్ల: మండల కేంద్రానికి చెందిన రచయిత, కవి, రేడియో ఆర్టిస్టు పల్లోలి శేఖర్‌బాబు డాక్టర్ కొలకలూరి ఇనాక్ జాతీయ సాహితీ సేవా అవార్డు అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో కొలకలూరి 86వ జన్మదినం సందర్భంగా వాల్మీకి సాహితీ సేవ సంస్థ చైర్మన్ వీడీ రాజగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కొలకలూరి ఇనాక్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి 16 మంది కవులు తెలుగు భాష సాహితీ సేవ చేస్తున్న వారిని గుర్తించి అవార్డులు ప్రదానం చేశారు.

నేలకొరిగిన విద్యుత్‌స్తంభాలు


గాలులకు నేలకొరిగిన చెట్టు


బనగానపల్లె: ఇల్లూరుకొత్తపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గులాంనబీపేట, కాపులపల్లె గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల ధాటికి సుమారు 30 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భారీ చెట్లు విరిగిపడ్డాయి. ఆయా గ్రామాల్లో సాయంత్రం నాలుగు గంటల నుంచి విద్యుత్ నిలిపివేసినట్లు రూరల్ ఏఈ గర్జప్ప తెలిపారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

బకాయిలు మంజూరు చేయించాలని మంత్రికి వినతి


మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న గ్రంథాలయ అధికారులు

బనగానపల్లె రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయించాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ప్రచార కార్యదర్శి, స్థానిక గ్రంథాలయశాఖ అధికారి బషీర్‌అహ్మద్ రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. లైబ్రరీల అభివృద్ధికి గ్రంథాలయ పన్ను ఎంతో ఉపయోగపడుతుందని.. అయితే చెల్లించాల్సిన బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయాయని.. విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి


దివ్యాంగుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె: పట్టణంలోని తెలుగుపేటలో సోమవారం ఉదయం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పలువురు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు, ఉపసర్పంచ్ బురానుద్దీన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్.. మొరాయించెన్..!

- సర్వర్ పనిచేయక అవస్థలు
- లబ్ధిదారులకు గంటల తరబడి తప్పని నిరీక్షణ
- టీడీపీ నాయకులతో ఫించన్ల పంపిణీ ప్రక్రియ


కోవెలకుంట్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు


కొలిమిగుండ్లలో ఒక చోట కూర్చొని పింఛన్లు అందిస్తున్న సిబ్బంది


సచివాలయం వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

కోవెలకుంట్ల: వలంటీర్ వ్యవస్థ ద్వారా ఐదేళ్లపాటు ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటి వద్ద పింఛన్లు అందుకున్న లబ్ధిదారులకు తెలుగుదేశం ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే అవస్థలు తప్పలేదు. గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆయా గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది 50 పింఛన్ల చొప్పున అందజేసేలా మ్యాపింగ్ చేశారు. కోవెలకుంట్ల మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా 6,041 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. సోమవారం పింఛన్ల పంపిణీ ప్రారంభం కాగా సర్వర్ మొరాయించడంతో సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 7.30 గంటల నుంచి సర్వర్ పనిచేయకపోవడంతో గ్రామ సచివాలయ సిబ్బంది గంటల తరబడి లబ్ధిదారుల ఇళ్ల వద్ద నిరీక్షించాల్సి వచ్చింది. మధ్యాహ్నం 12 గంటల వరకు ఇదే పరిస్థితి కొనసాగడంతో లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పలేదు. మొదటి రోజే పంపిణీ పూర్తి చేయాలని అధికారులు ఓవైపు ఒత్తిడి చేయడంతో గ్రామ సచివాలయ సిబ్బంది తిండి, తిప్పలు మానేసి పంపిణీకి ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఆయా గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

మొదటి రోజే ఆటంకాలు

కొలిమిగుండ్ల: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో మొదటి రోజే ఆటంకాలు ఏర్పడ్డాయి. సోమవారం తెల్లవారుజామున ఆరు గంటలకల్లా సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో పంపిణీ చేయాలని అధికారులు ఆదేశించారు. ఉద్యోగులు దూరప్రాంతాల నుంచి కేటాయించిన గ్రామాలకు చేరుకుని పంపిణీ మొదలుపెట్టారు. అయితే 8 గంటల తర్వాత సర్వర్ మొరాయించడంతో ఇక్కట్లు తప్పలేదు. పది గంటలు దాటినా ఇంటి వద్దకు పింఛన్ రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు. అష్టకష్టాలు పడి సచివాలయాల వద్దకు పరుగులు పెట్టారు. దివ్యాంగులు సైతం ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మధ్యాహ్నం వరకు సర్వర్ పని చేయకపోవడంతో సచివాలయాల వద్దనే వేచి చూడాల్సి వచ్చింది. పలు గ్రామాల్లో సచివాలయాల్లోనే పింఛన్ అందించారు. కొన్ని చోట్ల వీధుల్లో కూర్చుని నగదు అందజేశారు. చాలా మంది పనులు మానుకుని ఇళ్ల వద్ద ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వృద్ధులు, వితంతువులకు రూ.7 వేల చొప్పున ఇచ్చారు. దివ్యాంగులకు రూ.6వేలతోనే సరిపుచ్చడంతో ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్ వ్యవస్థ ఉన్న సమయంలో ఐదేళ్ల పాటు ఠంఛన్‌గా తెల్లవారుజామునే ఇంటి వద్దకే తీసుకొచ్చి ఇచ్చారని లబ్ధిదారులు గుర్తు చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో పింఛన్ల పంపిణీ సమయంలో అధికార పార్టీ నాయకులు హంగామా చేశారు. పంపిణీ చేసే సమయంలో సచివాలయ ఉద్యోగులను పూర్తిగా పక్కనపెట్టి నాయకులే పంపిణీ చేయడం గమనార్హం.

వృద్ధురాలికి వైద్య సేవలు


వృద్ధురాలికి వైద్యం చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: స్థానిక పద్మావతి వృద్ధాశ్రమంలోని 110 ఏళ్ల రాములమ్మకు స్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వైద్యం చేయించారు. వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన రాములమ్మ కొద్ది నెలలుగా ఆశ్రమంలో ఉంటోంది. ఈమె చేతికి గాయం కావడంతో స్ఫూర్తి సంస్థ 20 రోజులుగా వైద్య సిబ్బంది చేత వైద్యం చేయిస్తోంది.

ఘనంగా డాక్టర్ల దినోత్సవం

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో సోమవారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. వైద్యులు సాగరిక, చరన్ రాజు, సిబ్బంది కేక్ కట్ చేశారు. అనంతరం సిబ్బంది డాక్టర్లను సన్మానించారు.

చార్టెడ్ అకౌంట్స్ డే..

పట్టణంలోని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో చార్టెడ్ అకౌంట్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుప్త, వెంకట రమణ కోశాధికారి సురేంద్ర తదితరులు పట్టణ సత్తార్ అసోసియేట్స్ నిర్వాహకుడు సత్తార్ హాజీని సన్మానించారు.

పింఛన్ల పంపిణీకి రాజకీయ రంగు

- ప్రొటోకాల్‌కు తిలోదకాలిచ్చిన టీడీపీ శ్రేణులు
- ఉద్యోగులు, ప్రజాప్రతినిధులను దూరం పెట్టి పింఛన్ల పంపిణీ


తారకరామనగర్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

డోన్: టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రొటోకాల్‌ను కాలదన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండానే పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులున్నా.. వారికి కనీస సమాచారం ఇవ్వకుండానే ఎలాంటి హోదా లేకపోయినా అంతా తమదే అన్నట్లుగా వ్యవహరించారు. ప్రతి గ్రామం, వార్డుల్లో టీడీపీ కార్యకర్తలు పెన్షన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనడంతో చేసేదేమీ లేక సచివాలయ ఉద్యోగులు గుడ్లు అప్పగించి చూస్తూ ఉండిపోవాల్సి వచ్చింది.

పనిచేయని సర్వర్ .. వృద్ధుల అగచాట్లు

సచివాలయంలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు సర్వర్లు పనిచేయకపోవడం, పింఛన్ల పంపిణీ అలవాటు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడ్డారు. దీంతో చాలా చోట్ల వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నియోజకవర్గంలోని డోన్ అర్బన్‌లో 5,668, రూరల్‌లో 7,920, ప్యాపిలి మండలంలో 9,065, బేతంచెర్ల అర్బన్‌లో 4,194, బేతంచెర్ల రూరల్‌లో 6,400 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.7వేల చొప్పున పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేశారు. సచివాలయ అధికారులకు కొత్తగా విధులు అప్పజెప్పడం మూలంగా పింఛన్ల పంపిణీ మందకొడిగా సాగడంతో పలుచోట్ల వృద్ధులు, రోగులు సకాలంలో పెన్షన్ అందక ఇబ్బందులు పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా 1వ తేదీ సాయంత్రంలోపు 98.9 శాతం పింఛన్లు పూర్తయిన ఘటనలు ఉన్నాయి. అయితే సచివాలయ అధికారుల అవగాహన లోపంతో ఈ నెల మొదటి రోజు 80 శాతం కూడా పూర్తికాలేదు.

హామీలన్నీ నెరవేరుస్తాం

– డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి


ప్యాపిలి మండలం బూరుగలలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి/బేతంచెర్ల: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. ప్యాపిలి మండలంలోని బూరుగల, కౌలుపల్లి, బేతంచెర్ల మండలంలోని ఆర్ కొత్తపల్లె, ఆర్ బుక్కాపురం, అంబాపురం గ్రామాల్లో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జయసూర్య ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు. పెంచిన పింఛన్ రూ.4000తో పాటు మూడు నెలలకు సంబంధించిన అరియర్స్ రూ.3,000 కలిపి మొత్తం రూ.7,000 చొప్పున ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూలై 1 వ తేదీనే పెంచిన పింఛన్లు మంజూరు చేశారన్నారు. కాగా మొదటి రోజు ప్యాపిలి మండలంలో 97 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ సాయిమనోహర్ తెలిపారు.

– బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, వార్డు కౌన్సిలర్స్ ఆదిలక్ష్మి, అంజి, గోపాల్ ఆధ్వర్యంలో బేతంచెర్లలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలో ఎంపీడీఓ రవిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

ఉద్యోగ నియామకాలు చేపట్టాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

డోన్ టౌన్: భారతీయ జీవిత బీమా సంస్థలో ఖాళీగా ఉన్న 2,700 ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డోన్ బ్రాంచ్ కార్యదర్శి దేవన్న డిమాండ్ చేశారు. ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కార్యాలయంలో సోమవారం సీనియర్ ఉద్యోగి ఆనంద్ బాబు చేతుల మీదుగా జెండా ఆవిష్కరించి ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. అనంతరం భోజన విరామ సమయంలో కాసేపు నిరసన వ్యక్తం చేసి, బ్రాంచ్ మేనేజర్ రాముడుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రహంతుల్లా, నాయకులు హరిప్రసాద్, బీనారావు, రాఘువయ్య, సత్యవాణి, రాజశేఖర్, సురేష్, కిరణ్‌కుమార్, వీరన్న, హరిరావు, గోకుల్ కృష్ణ, హుస్సేన్, కళ్యాణ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను విడుదల చేస్తున్న కమిషనర్ జయరామ్, డాక్టర్ షబాజ్ హుస్సేన్

డోన్ టౌన్ : ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా ఆగస్టు 31 వరకు చేపడుతున్న స్టాప్ డయేరియాకు ప్రతి ఒక్కరు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ షబాజ్ హుస్సేన్ కోరారు. స్టాప్ డయేరియా కార్యక్రమ వాల్ పోస్టర్లను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డయేరియా వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

డోన్ రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ చెన్నకేశవులు విద్యార్థులకు సూచించారు. చిన్నమల్కాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీజనల్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడారు.

కాసరకాయలకు భలే గిరాకీ

పేదోడి మాంసాహారంగా పిలిచే కాసర కాయలకు భలే గిరాకీ ఏర్పడింది. విక్రయదారులు అనంతపురం నుంచి కాసర కాయలను తీసుకొచ్చి కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, గ్రామ పంచాయతీ సర్కిల్, గాంధీసెంటర్, తదితర ప్రాంతాల్లో కిలో రూ. 200 చొప్పున విక్రయిస్తున్నారు. ప్రజలు కాసరకాయలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. రోజుకు 100 నుంచి 150 కిలోల కాసరకాయలు అమ్ముడవుతున్నాయి. –కోవెలకుంట్ల


తోపుడుబండిపై కాసరకాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

దరఖాస్తుల ఆహ్వానం

బేతంచెర్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో 2వ విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు జూలై 24లోగా ఐటీఐ ఏపీ గవర్నమెంట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 25వ తేదీన సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు. సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులు 27, 28 తేదీలలో ప్రభుత్వ ఐటీఐలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

కంపచెట్ల తొలగింపు

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించారు. సోమవారం సర్పంచ్ శివరాముడు జేసీబీతో ట్యాంక్ చుట్టూ అల్లుకుపోయిన చెట్లను తొలగించి శుభ్రం చేయించారు. గ్రామానికి నీటి సరఫరా చేసే సమయంలో ట్యాంక్ వద్ద గేట్ వాల్వ్ వద్దకు రోజు వాటర్ మెన్ వెళ్లాల్సి ఉంటుంది. చెట్లు పూర్తిగా అల్లుకుపోవడంతో పాటు విషసర్పాలు సంచరిస్తుండటంతో తొలగించారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు శివరామ్ డిమాండ్ చేశారు. స్థానిక లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన చట్టం ద్వారా ప్రమాదం స్థలం నుంచి డ్రైవర్ పారిపోతే పదేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తూ చట్టం చేయడం తగదన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో డ్రైవర్ ఉంటే వారి ప్రాణాలకు రక్షణ ఎక్కడ ఉంటుందన్నారు. చట్టాన్ని రద్దు చేయకపోతే కార్మికులు, రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఫెడరేషన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు కొండయ్య, నాగమద్దయ్య, డ్రైవర్లు రామచంద్రారెడ్డి, మధురెడ్డి, గోపాల్, గిడ్డయ్య, శ్రీను, మధు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: కృతిమ అవయవాల కోసం దివ్యాంగులు పేర్లను నమోదు చేసుకోవాలని బేతంచెర్ల స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి, రాముడు సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రమైన నంద్యాలలో ఈనెల 4న భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో కృతిమ అవయవాలు (కాళ్లు, చేతులు) పంపిణీ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మరింత సమాచారం కోసం 9951474263, 9989983673 నంబర్లను సంప్రదించాలన్నారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

ప్యాపిలి: ఈ నెల 8 నుంచి 10 వ తేదీ వరకు కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్యప్రతాప్, జిల్లా సహాయ కార్యదర్శి శివకేశవులు కోరారు. సోమవారం ఎస్టీయూ కార్యాలయ ఆవరణలో వారు కరపత్రాలు విడుదల చేశారు. ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బాషా, చంద్రనాయక్, మధు, ప్రసాద్, రాజేశ్ పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం


డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కోవెలకుంట్ల: వర్షాకాలం కావడంతో అతిసార(డయేరియా) ప్రబలే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుభాని సూచించారు. సోమవారం మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాల కారణంగా కలుషిత నీరు తాగడం వల్ల వాంతులు, విరేచనాలు సంభవించి ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు అతిసార బారిన పడుతున్నారన్నారు. డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. లక్షణాలు కన్పించిన వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌ఆర్ నిధులతో సేవా కార్యక్రమాలు


వైద్యులకు బీపీ ఆపరేటర్లను అందిస్తున్న రామ్‌కో యూనిట్ హెడ్

కొలిమిగుండ్ల: రామ్‌కో సిమెంట్ సీఎస్ఆర్ నిధులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కంపెనీ యూనిట్ హెడ్ రెడ్డినాగరాజు అన్నారు. ప్రెసిడెంట్ రామరాజుతో కలిసి సోమవారం కొలిమిగుండ్ల పీహెచ్‌సీకి ఐదు బీపీ అడాప్టర్లు, పది కుర్చీలను మెడికల్ ఆఫీసర్లు హరిచరణ్‌రెడ్డి, నాగజ్యోతిలకు అందజేశారు. అలాగే కొలిమిగుండ్ల జ్వాలా కాంప్లెక్స్‌లో మహిళలకు ఆర్గానిక్‌తో తయారు చేసే ఆహార పదార్థాలపై ఇచ్చిన శిక్షణ ముగియడంతో వారికి సర్టిఫికెట్లు అందజేశారు. మహిళలు స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో టైలరింగ్, అల్లికలు తదితర వాటిపై శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. జనరల్ మేనేజర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా ఉమామహేశ్వరుని పల్లకీ సేవ


శివపార్వతులకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీపై కొలువుదీర్చి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ రైతుకు ఊరటనిచ్చిన వర్షం


కోవెలకుంట్లలో కురుస్తున్న వర్షం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి కోవెలకుంట్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, సంజామల మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. సోమవారం ఉదయం నుంచి ఎండగా ఉండి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని సాయంత్రం వర్షం కురిసింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పత్తి, మినుము, కంది, మొక్కజొన్న, పెసర, ఆముదం, తదితర పంటల సాగుకు అదును కావడంతో రైతులు విత్తనానికి పొలాలను సిద్ధం చేసుకున్నారు. పది రోజుల నుంచి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో వర్షం పడడంతో ఊరట చెందుతున్నారు. విత్తనం వేసేందుకు వర్షం అనుకూలంగా మారడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం


డయేరియా లక్షణాలను వివరిస్తున్న మెడికల్ ఆఫీసర్

బనగానపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ తీసుకునే ఆహారంతో పాటు తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. సోమవారం బనగానపల్లె పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో స్టాప్ డయేరియా కేర్ కాంపియన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. అతిసార(డయేరియా) ఏడాది లోపు పిల్లల నుంచి మొదలు పెద్దవారి వరకు వస్తుందన్నారు. వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, జ్వరం తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పరిసరాల శుభ్రతతో పాటు మంచి ఆహారం తీసుకోవడం వల్ల రోగాలకు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ అయ్యమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని పెట్నికోటకు చెందిన దూదేకుల దస్తగిరి(40) వారం క్రితం కదిరికుంట వద్ద బైక్ అదుపుతప్పడంతో కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రికెట్‌లో విద్యార్థుల ప్రతిభ

డోన్ టౌన్: పట్టణానికి చెందిన విద్యార్థులు లోహిత్, రవిశంకర్, కళ్యాణ్ చక్రవర్తి, దావూద్ హుస్సేన్‌లు జూన్ 22న హర్యాన రాష్ట్రంలోని కురుక్షేత్రంలో జరిగిన జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. లోహిత్ మ్యాన్ అఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

దర్గాలో తమిళవెబ్ సిరీస్ షూటింగ్

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వలకొండ వద్ద ఉన్న మౌలాలీస్వామి దర్గా ఆవరణలో ఈత్తూరి డేస్ అనే తమిళవెబ్ సీరిస్ షూటింగ్ సోమవారం జరిగింది. వై నాట్ బ్యానర్‌పై రోషన్ మ్యాథ్యూస్, సంయుక్త హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారని, నిషాంత్ దర్శకత్వం వహిస్తున్నారని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.